జగన్ ప్రజారంజక పాలనను ఆశీర్వదించండి

- ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని
- డ్వాక్రా మహిళలకు రూ.27 కోట్ల ఆసరా చెక్కు అందజేత



ఆసరా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని



మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న నాని

ఏలూరు (టూటౌన్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని మహిళలను కోరారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కార్యక్రమం స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో శనివారం సాయంత్రం ఏలూరు నగర కమిషనర్ ఎస్ వెంకటకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాని జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మెప్మా ఆధ్వర్యంలో వివిధ స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే నాని ప్రారంభించారు. వైఎస్సార్ ఆసరా రూ.27 కోట్ల చెక్కును మహిళలకు నాని అందజేశారు. ఎమ్మెల్యే నానిని గజమాలతో సత్కరించారు.

36 వేల మందికి రూ.110.70 కోట్ల లబ్ధి

ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఏలూరు నియోజకవర్గంలోని 36 వేల మంది డ్వాక్రా మహిళలకు రూ.110.70 కోట్లు అందించామన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారతకు ముఖ్యమంత్రి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, రాష్ట్రంలోని కోట్లాది మంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపారని చెప్పారు. జగన్ తన పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ద్వారా రుణమాఫీ మొత్తాన్ని డ్వాక్రా మహిళలకు నేరుగా అందించారని వివరించారు. ఈ ఏడాది నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో 3,600 డ్వాక్రా సంఘాలకు చెందిన 36 వేల మంది మహిళలకు రూ.27 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు.



థ్యాంక్యూ సీఎం ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మహిళలు



ఎమ్మెల్యే నానికి పూలదండ వేసి సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న మైనార్టీ మహిళలు

రూ.500 కోట్లతో అభివృద్ధి

ఏలూరు నియోజకవర్గాన్ని రూ.500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని, వీటిలో 90 శాతం పనులు పూర్తయ్యాయని ఎమ్మెల్యే నాని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజా సమస్యలు తెలుసుకున్నామని, రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.500 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మహిళల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని చెప్పారు. ఏలూరు నగరంలోని ప్రతి డివిజన్‌లో రూ.3 కోట్లతో రోడ్లు, డ్రెయిన్ల వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తూ.. నాడు – నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

కిక్కిరిసిన స్టేడియం

వేలాదిగా తరలివచ్చిన మహిళలతో స్టేడియం కిక్కిరిసిపోయింది. చాలా మంది మహిళలు రోడ్డుపైనే నిరీక్షించాల్సి వచ్చింది. సభలో థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. జగనన్న జిందాబాద్ అంటూ నినదించారు. ఎమ్మెల్యే నానికి ముస్లిం మహిళలు పూలదండ వేసి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్ బాబు, గుడిదేశి శ్రీనివాసరావు, కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్ గురునాథ్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, మెప్మా పీడీ బి.ఇమ్మానియేలు, పలువురు కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళలకు వైద్య పరీక్షలు



మహిళకు వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ షాజియా సుల్తానా

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక ఏలూరు సన్ రైజ్ లయన్స్ క్లబ్, ఏలూరు స్మార్ట్ ప్రొఫెషనల్స్ లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక జింగిల్‌బెల్స్ పాఠశాలలో గైనకాలజీకి సంబంధించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గైనకాలజీ నిపుణురాలు ఎండీ షాజియా సుల్తానా 150 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎన్‌వీ సురేష్ కుమార్, వి.మల్లికార్జునరావు, వి.కృష్ణమోహన్, జింగిల్ బెల్స్ పాఠశాల డైరెక్టర్ వి.సురేష్, ప్రిన్సిపాల్ కె.వి జయలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. వైద్యుడు బీవీఎం నగేష్ బృందం 118 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన సలహాలు సూచనలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బొలిశెట్టి సురేష్ కుమార్, చెన్నా వెంకట్రామయ్య, బచ్చు విష్ణు, కోరుకొండ ప్రసాద్, మద్దుల రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు సంగీత విభావరి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యంలో శతాబ్ది గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 11న సంగీత విభావరి నిర్వహించనున్నట్లు సంగీత కళాశాల అధ్యక్షురాలు వి.రేవతి రామ్‌కుమార్ తెలిపారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన సీనియర్ గాయకులతో పాటు ఔత్సాహిక గాయకులు ఘంటసాల పాటలు ఆలపించి అలరిస్తారని పేర్కొన్నారు. ఘంటసాల అభిమానులు, సినీ మధుర గీతాల అభిమానులంతా పాల్గొనాలని కోరారు.

12 నుంచి కొవ్వలిలో దీవెనల పండగలు

దెందులూరు: కొవ్వలి అంబేడ్కర్ కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు దీవెనల పండుగ నిర్వహించనున్నట్టు పాస్టర్ విలియమ్స్ తెలిపారు. శనివారం కొవ్వలిలో ఆమె మాట్లాడుతూ బేతేలు సువార్త సహవాసం చర్చి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 17 వరకు నిర్వహించనున్న దీవెన పండుగలో మన్నా చర్చి ఫాస్టర్ ఎస్.జ్యోతిరాజు, ముఖ్య పాస్టర్లు పాల్గొని ప్రత్యేక వ్యాఖ్య సందేశం, ప్రార్థనలు చేస్తారన్నారు. దెందులూరు, సమీప మండలాల్లో సువార్తీకులు దీవెనల పండుగలో పాల్గొని ఏసు క్రీస్తు ఆశీర్వాదాలు పొందాలని పాస్టర్ విలియమ్స్ కోరారు.

మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆరోగ్యంగా ఉన్న వారు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చని ఏలూరూ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఏలూరు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ గతేడాది రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా తమ ఆర్టీసీకి చెందిన 100 మంది రక్తదానం చేశారని, ఈ ఏడాదీ ఎక్కువ సంఖ్యలో కార్మికుల పాల్గొన్నారని తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ వైద్యాధికారి ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో చిన్న పిల్లలు, తలసీమియా బాధితులకు ప్రతివారం రెడ్‌క్రాస్ ద్వారా రక్తం అందిస్తున్నట్టు చెప్పారు. గర్భిణులు, ప్రమాదాల్లో క్షతగాత్రులకు రక్తం సరఫరా చేస్తున్నామన్నారు. బాధితుల అవసరం మేరకు రక్తం అందుబాటులో ఉండడం లేదని, రక్తదానంపై ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై రక్తదానం చేస్తే ఎన్నో కుటుంబాలు రోడ్డున పడకుండా కాపడవచ్చని అన్నారు. ఏటా రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. రెడ్‌క్రాస్ సిబ్బంది ఆర్టీసీ కార్మికుల నుంచి రక్తం సేకరించారు. ఈ శిబిరంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి 100 మంది పైగా కార్మికులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, నూజివీడు డిపో మేనేజర్ సీహెచ్ పవన్ కుమార్, ఏఎంటీ జి.మురళి, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ ఐ.ప్రేమ్ కుమార్, పీఆర్‌ఓ కేవీ రమణ, ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ బి.భాను, పీఆర్‌ఓ కేఎల్‌వీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



విజయరాజుతో సందీప్

ఏలూరు (టూటౌన్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమైందని లిడ్‌క్యాప్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ చింతలపూడి నాయకుడు సొంగా సందీప్ అన్నారు. శనివారం ఏలూరులో జరిగిన బాబూ జగ్జీవన్‌రామ్ కమిటీ సమావేశానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంత్రి వర్గంతోపాటు నామినేటెడ్ పదవుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీలకు పెద్దపీట వేస్తూ సామాజిక న్యాయం చేశారని చెప్పారు. గత ప్రభుత్వాలు అణగారిన వర్గాలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకుని వదిలేశాయని విమర్శించారు. ఇందుకు భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలను హక్కున చేర్చుకుంటూ రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ.. వారి కుటుంబాలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగేలా తోడ్పాటు అందిస్తోందని వివరించారు. ఇటీవల రాజ్యసభ టిక్కెట్ల కేటాయింపులోనూ ఇదే సామాజిక న్యాయం పాటిస్తూ బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలో ఉండగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏనాడూ న్యాయం చేసిన దాఖలాలు లేవన్నారు. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా అంటూ.. ఎస్సీల మనోభావాలను దెబ్బ తీసిన చరిత్ర చంద్రబాబుదని గుర్తుచేశారు. పేద, బడుగు, బలహీన వర్గాలను హక్కున చేర్చుకునే జగన్‌ను వచ్చే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిని చేయాలని, అభ్యర్థులు అందర్నీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఏలూరు, నరసాపురం ఎంపీ అభ్యర్థులుగా బీసీ వర్గానికి ఇచ్చి మరోసారి సీఎం జగన్ సామాజిక న్యాయాన్ని రుజువు చేశారని సందీప్ కొనియాడారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందజేత

ఏలూరు (టూటౌన్): మానవత ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఆర్‌బీఎస్‌కే సెంటర్‌లో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. శనివారం ఉదయం మానవత జిల్లా విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, పఠాన్ హుస్సేన్ ఖాన్, అందె మునలయ్య, షేక్ షబ్బీర్‌ఉన్నీసా, అట్లూరి సుచరితల సౌజన్యంతో 25 మంది హెచ్ఐవీ బాధితులకు, 10 మంది టీబీ బాధితులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వర్మ, ఆర్ఎంఓ ప్రసాదరెడ్డి, ఏఆర్‌టి సెంటర్ మెడికల్ ఆఫీసర్ యూపీఎన్ శాస్త్రి, డైటీషియన్ పి.సౌజన్య, మానవత ఏలూరు యూనిట్ అధ్యక్షుడు మేతర అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక అభివృద్ధి విశ్వవ్యాప్తం కావాలి

దెందులూరు : ఆధ్యాత్మికాభివృద్ధి, విశ్వవ్యాప్తంగా కావాలని పీసీడబ్ల్యూఎం సుమిత్ర మసీ అన్నారు. శుక్రవారం గృహసమితి ర్యాలీ, సమావేశాలకు సుమిత్రమసీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రతి తల్లీ చిన్ననాటి నుంచి ఆధ్యాత్మిక చింతన, క్రమశిక్షణ, సత్ప్రవర్తన లక్ష్యంగా విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాల్వేషన్ ఆర్మీ మేజర్ కె.మేరీ కుమారి, మేజర్ కె.సుశీల, మేజర్ డి.అరుణ, సువర్ణబాయి, మేరికుమారి, గృహసమితి సభ్యులు ఉన్నారు.

ఆటపాటలతో కూడిన బోధనతో జ్ఞాపక శక్తి వృద్ధి

పెదవేగి : ఆటపాటలతో కూడిన బోధనతో చిన్నారుల్లో జ్ఞాపక శక్తి వృద్ధి చెందుతుందని పెదవేగి సెక్టారు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్. పార్వతి అన్నారు. అంగన్‌వాడీ విద్య, ఆట పాటలతో విద్య కార్యక్రమంలో భాగంగా శనివారం రంగుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఆకు పచ్చని రంగు కలిగిన వివిధ రకాల వస్తువులు, దుస్తులు, ఆకులు వంటివాటిని ప్రదర్శించి పిల్లలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉషారాణి, తులసి, సహాయకురాలు మస్తాన్ బీ పాల్గొన్నారు.

రంజాన్‌లోపు అంజుమన్ ఎన్నికలు



సమావేశంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : వచ్చే రంజాన్‌లోపు నగరంలోని అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ నూతన పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని ఆ సంస్థ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. శనివారం స్థానిక అంజుమన్ హాల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలను చర్చించారు. కార్యవర్గంలోని కొందరు సభ్యులు కావాలని కోర్టులకెళ్లి అంజుమన్ సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని, దీంతో కార్యవర్గం ప్రణాళిక ప్రకారం కార్యకలాపాలు నిర్వహించలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణకు ఎండీ ఇబ్రహీం, ఎండీ ముజాహిద్, షేక్ జమా, ఎండీ ఇలియాస్, ఎండీ మున్వర్‌లతో కమిటీని ఏర్పాటుచేశారు. ఎన్నికల విధి విధానాలను రూపొందించేలా నిర్ణయం తీసుకున్నారు. అంజుమన్ సంస్థలో ఇప్పటి వరకు 1,600 మంది సభ్యులుగా ఉండగా, ఇటీవల సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టగా కొత్తగా 1,345 మంది సభ్యత్వాలు పొందారు. వీరందరికీ వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగం, పోటీ చేసే అవకాశాలపై సాంకేతికంగా ఉండే సాధ్యాసాధ్యాలపై సబ్ కమిటీ నిర్ణయం తీసుకునేలా తీర్మానం చేశారు. అంజుమన్ కార్యవర్గంలో ఉన్న 35 స్థానాలను కొత్తగా సభ్యత్వాలు పెరిగిన మేరకు కమిటీ స్థానాలను పెంచడం, పెరిగిన సభ్యత్వాల నిష్పత్తి ప్రకారం వార్డులను పునర్విభజించడం వంటి చర్యలు సబ్ కమిటీకి తీసుకునే విధంగా తీర్మానం చేశారు. సమావేశంలో అంజుమన్ సంస్థ ప్రతినిధులు ఎండీ సులేమాన్, అమీర్ జానీ, వాహదుల్లా షరీఫ్, రాజా అహ్మద్, ఎండీ ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

16న బంద్, సమ్మెను విజయవంతం చేయాలి



ప్రదర్శన చేస్తున్న ఐఎఫ్‌టీయూ శ్రేణులు

ఏలూరు (టూటౌన్) : కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించే పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రదర్శన చేశారు. స్థానిక వైఎంహెచ్ఏ సెంటర్ నుంచి మెయిన్ బజార్, చందన బ్రదర్స్, బిర్లా భవన్ సెంటర్ మీదుగా ఎస్ఎస్ మార్కెట్ వరకు ప్రదర్శన కొనసాగింది. అనంతరం నిర్వహించిన సభలో ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. మతతత్వ విధానాలతో దేశ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ ప్రజల సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇఫ్టూ నాయకులు ఎం.అప్పారావు, గడసాల రాంబాబు, దూళ్ల వీరినాయుడు, సందకం అప్పారావు, రంగాల నూకరాజు, కోరాడ అప్పారావు, మామిడి శ్రీనివాసరావు, పీడీఎస్‌యు నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి పాల్గొన్నారు.

విద్యావిషయ కార్యక్రమాల నిర్వహణ పరిశీలన

భీమడోలు: ప్రభుత్వ పాఠశాల్లో అమలు చేస్తున్న విద్యా విషయక కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించేందుకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను రెండో రోజు శనివారం పరిశీలన బృందాలు సందర్శించాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, కురెళ్లగూడెం, ఆగడాలలంక కాంప్లెక్స్ పరిధిలోని 53 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు బి.శ్రీనివాసరావు, సునీత, భువనేశ్వరరావు, జాన్‌రంగనాయకులు, సత్యనారాయణతో పాటు సీఆర్‌పీలు ప్రాథమిక, యూపీ, ఉన్నత పాఠశాలలను ఎంఈఓలు అయినపర్తి భాస్కరరావు, ఈ.శ్రీనివాసరావు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలను అందించారు.

పేదల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్



సత్యవోలు ప్రజా ఆశీర్వాద యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న అబ్బయ్యచౌదరి, ప్రక్కన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని పేదల కోసం నవరత్న పథకాలను ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తెలిపారు. పెదపాడు మండలం సత్యవోలు, ఎస్ కొత్తపల్లి, కడిమికుంట, కొనికి గ్రామాల్లో శనివారం ప్రజా ఆశీర్వాద యాత్రను, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభించారు. తొలుత ప్రజలు అబ్బయ్యచౌదరికి ఘన స్వాగతం పలికారు. వారిపై పూల వర్షం కురిపించారు. మహిళలు మంగళ హారతులు అందించారు. వీధుల వెంబడి పాదయాత్ర చేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ సామాజిక న్యాయం చేతల్లో చూపిస్తున్న నాయకులు సీఎం జగన్ అని కొనియాడారు. రాష్ట్రంలో కుల, మత, వర్గ బేధం లేకుండా ప్రతి ఇంటికీ పథకాలు అందిస్తున్నామని అన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి వేగవంతమైందన్నారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో రూ.కోటి వ్యయంతో గ్రామ సచివాలయ భవనం, ఆర్‌బీకే భవనం, వెల్‌నెస్ సెంటర్, మిల్క్ సెంటర్లను నిర్మించినట్టు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రధాన రహదారులను అభివృద్ధి చేశామన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు విస్తృత సేవలు అందుతున్నాయని అన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి ఘన విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, పెదపాడు, గోగుంట సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, భావరాజు సత్యన్నారాయణ, గ్రామ సచివాలయాల మండల అధ్యక్షుడు అక్కినేని గోపి, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, కడిమి గోవిందరావు, ముదుగురు సూర్యనారాయణ, మండల ఉపాధ్యక్షురాలు రెడ్డి స్వర్ణకుమారి, ఏపూరు సర్పంచ్ రామకృష్ణ, బెజవాడ శేఖర్, బత్తుల ఏసురాజు, వట్రపు కోటిరెడ్డి, సాధం కిశోర్ సర్పంచ్ చేపేని రంగారావు, సాధం కిశోర్, తమలాల శ్రీనివాసరావు గ్రామ నాయకులు వైకుంఠపు ధనంజయ్, సొంగల మహేశ్వరరావు, ఉప సర్పంచ్ పెంకి శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	30
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	64
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	08-10
బెండకాయలు	32	కంద	64
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	36
కాకర కాయలు	50	కీరా దోస	30
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	64
బీరకాయలు (పందిరి)	--	అల్లం	120
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	24-34	పాలకూర	10
దొండకాయలు	34	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	20-25	గోంగూర	08
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	30-36	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	06
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	01
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	06
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	08
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34

